www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024


వైఎస్ఆర్

ఉద్యోగం సాధించలేకపోతే ఫీజు వాపసు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఇంజినీరింగ్ కళాశాలలో తలమానికంగా నిలిచే కడప కెఎస్ఆర్ఎం కళాశాల మేనేజ్మెంట్ వారు ఈ సంవత్సరం (2024-25) తమ కళాశాలలో చేరే విద్యార్థులకు తమ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించి పూర్తయిన అనంతరం ఉద్యోగం సాధించ లేకపోతే ఆ విద్యార్థినులకు తాము నాలుగేళ్లు చెల్లించిన పూర్తి ఫీజు మొత్తాన్ని తిరిగి వెనక్కు ఇస్తామని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రబాబురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తాము నాలుగేళ్లు ఉద్యోగం పొందేందుకు ఇచ్చే ప్రత్యేక తర్ఫీదు, మెలకువలు, శిక్షణ విద్యార్థులు ఉద్యోగం పొందేందుకు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తాము ఇంత కచ్చితంగా ఉద్యోగ సంపాదనలో ఇంత నమ్మకంగా చెప్పగలుగుతున్నట్లు తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ఏ కళాశాల ఇవ్వని ఇలాంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆధునికీకరణకు నోచని 'మైలవరం'

- అధ్వానంగా ఆనకట్ట
- దెబ్బతిన్న రక్షణ గోడలు
- కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం లభించేనా?

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

మైలవరం జలాశయం (తాతిరెడ్డి నరసింహారెడ్డి జలాశయం) 15 ఏళ్ల నుంచి ఆధునికీకరణకు నోచుకోక అధ్వానంగా తయారైంది. మైలవరం ఆనకట్టను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన మైలవరం జలాశయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆధునికీకరణకు ఆమడ దూరంలో ఉందని పలువురు వాపోతున్నారు. 9.65 టిఎంసిల నీటి సామర్థ్యంతో నిర్మించిన జలాశయం ప్రస్తుతం 6.5 టిఎంసిల సామర్థ్యంకు తగ్గింది. ఈ జలాశయంపై గండికోట జలాశయాన్ని ఏర్పాటు చేయడంతో సామర్థ్యం తగ్గింది. ప్రస్తుతం జలాశయంలోకి గండికోట జలాశయం నుంచి రోజుకు 400 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ప్రస్తుతం 0.604 టిఎంసిలకు చేరింది. మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం, ప్రొద్దుటూరు మండలాలలోని గ్రామాలకు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణాలకు తాగు, సాగునీటికి ఈ జలాశయమే మూలాధారం. మైలవరం జలాశయం గేట్ల వద్ద రక్షణ గోడలు ఎన్నో సంవత్సరాల కిందటే పడిపోయాయి. ప్రయాణికులు కానీ, పర్యాటకులు కానీ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న అటు జలాశయంలో కానీ, ఇటు గేటు వైపుకు కిందికి కానీ పడిపోయే ప్రమాదముంది. రక్షణ గోడలు పెచ్చులూడిన చోట కడ్డీలు కనపడుతూ పడిపోయేలా ఉన్నాయి.


రక్షణ గోడ దెబ్బతినడంతో పొంచిఉన్న ప్రమాదం


అధ్వానంగా ఉన్న జలాశయంపై ఉన్న రోడ్డు

కట్టపైన గుంతలతో రోడ్డు దర్శనమిస్తుంది. కాలం, పాలకులు మారుతున్నా జలాశయం రూపురేఖలు మాత్రం మారలేదని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వానికి మైలవరం జలాశయం, మైలవరం మ్యూజియం ఆధునికీకరణ కోసం 79.50 కోట్లు అవసరం అవుతాయని భావించి ఒక నివేదికను అప్పటి జలాశయం డిఇ నరసింహ మూర్తి పంపారు. ఆ ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోలేక పోయింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు, ప్రస్తుత పాలకలు స్పందించి మైలవరం జలాశయానికి మరమ్మతులు చేసి కట్టపై తారు రోడ్డు వేయించాలని ప్రజలు, పర్యాటకలు కోరుతున్నారు.

సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

రానున్నది వర్షాకాలం కావడంతో ముందస్తు చర్యలు తీసుకున్నాం. పైనుంచి నీరు వచ్చినా కట్టకు కానీ, గేట్లకు కానీ ఎలాంటి సమస్యలు లేవు. మైలవరం జలాశయం, మ్యూజియం ఆధునికీకరణకు, గేట్ల వద్ద, ఆనకట్ట రక్షణ గోడలు, తారు రోడ్డు వంటి పనుల కోసం గత ప్రభుత్వానికి రూ.79.50కోట్లతో ఒక నివేదిక ఉన్నతస్థాయి అధికారులు పంపారు. ఇప్పటికీ అనుమతులు రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టుపై సమాచారం కొరగానే సమస్యలను వివరిస్తాం.

- గౌతమ్ రెడ్డి ఎఇఇ, మైలవరం జలాశయం.

ఆధునికీకరణ పనులు చేపట్టాలి

కూటమి ప్రభుత్వం మైలవరం జలాశయం ఆధునికీకరణ పనులు చేపట్టేలా నిధులు మంజూరు చేయాలి. కట్ట వెంబడి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి. మ్యూజియం పనులు చేపట్టి పర్యటకంగా కూడా అభివృద్ధి చేయాలి.

-దాసరి విజయ్, సిఐటియు పట్టణ కార్యదర్శి

వైసిపి ప్రభుత్వంలో 1.70 లక్షల ఎకరాలు దోపిడీ

- సహకరించిన అధికారులు, నాయకులపై చర్యలు
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు
- వంద శాతం హామీలను అమలు చేస్తాం
- విలేకరుల సమావేశంలో మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నాయకులు రూ.36 వేల కోట్లు విలువ చేసే 1.70 లక్షల ఎకరాల భారీ భూదోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలలో పుంగనూరు, తంబళ్లపల్లె టిడిపి ఇన్‌ఛార్జులు చల్లాబాబు, జయచంద్రరెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చిత్తూరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లి ప్రాంతాలలో పెద్దిరెడ్డి కుటుంబం పెద్ద ఎత్తున భూదోపిడి చేసిందన్నారు. ప్రభుత్వ భూము లను ఆక్రమించుకోవడంతో పాటు వంశపారంపర్యంగా వస్తున్న కొందరి ప్రయి వేటు వ్యక్తుల భూములను సైతం బెదిరించి వారివద్ద నుంచి దౌర్జన్యంగా లాక్కొని వేల ఎకరాల పోగేసుకున్నారని ఆరోపించారు. వీటన్నిటిపైన సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రయివేట్ వ్యక్తులు ఎవరైనా భూములు కోల్పోయుంటే ఫిర్యాదు చేస్తే వారి భూములు వారికి ఇచ్చేం దుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తుందన్నారు. పెంచిన పెన్షన్లను ఒకటో తేదీ నాడే ప్రతి ఒక్కరికి ఇంటికెళ్లి అందించడంతో చరిత్ర సృష్టించామన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో చేయలేని పనిని మా ప్రభుత్వం కేవలం 30 రోజుల్లో చేసి చూపించిందని స్పష్టం చేశారు. ఇక సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కదాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభు త్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తు న్నామని, దాని తర్వాత మహిళలకు ఉచిత సిలిండర్లు, ఆ తర్వాత ఉచిత బస్సు ప్రయాణం ఒకదాని తర్వాత ఒకటి ఖచ్చితంగా అమలు చేసి చూపిస్తామని తెలి పారు. పోలవరం పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరందించేందుకు మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడోరోజు చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టును సందర్శిం చారని గుర్తు చేశారు. మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాలలో సుమారు మూడు వేల ఎకరాలు భూమి అన్యాకాంతమైనట్లు విలేకరులు మంత్రి దృష్టికి రావడంతో మూడు వేల ఎకరాలు కంటే ఇంకా ఎక్కువ భూమి అన్యాక్రాంతమైందని, వీటన్నిటిని రెవెన్యూ సిబ్బంది ద్వారా సర్వే చేయించి తిరిగి రాబడతామని స్పష్టం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి ఫ్యామిలీ ఇరిగేషన్ ప్రాజెక్టులలో రూ.వంద టెండర్‌ను రూ.3 వేలకు వేసి ఇతర కంపెలను రానియ్యకుండా రూ.వేలకోట్ల ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారని ఆరోపించారు. వీటన్నిటిని పరిశీలించి దోచుకున్న సొమ్మును తిరిగి రాబడతామన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ప్రభుత్వం స్పష్టంగా ఉందని ఎవరిపైన కక్ష పూరిత కేసులు లేవన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రోజుకు 6, 7 అక్రమ కేసులు నమోదయ్యేవని ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. టిడిపి కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను పరిశీలించి ఎత్తివేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ప్రజలందరూ చంద్రబాబు పాలనలో చాలా సంతోషంగా ఉన్నారని రానున్న రోజులు మరిన్ని మంచి కార్యక్రమాలను చేపడుతామని మంత్రి తెలియజేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అంగన్వాడీల సమ్మె చారిత్రాత్మకం : సిఐటియు



అంగన్వాడీల సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

అంగన్వాడీల సమ్మె చారిత్రాత్మకమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహన్ అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ జీతాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని 2023, 2024 సంవత్సరం మధ్యకాలంలో 42 రోజులు పాటు రాష్ట్ర మంతా సమ్మె నిర్వహించారన్నారు. సమ్మెకు సంబంధించిన పోరాట బుక్‌లెట్‌ను బి.మనోహర్‌తో పాటు సిఐటియు జిల్లా కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్.లక్ష్మీదేవి, కుసుమ కుమారి పవనులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అంగన్వాడీలు సమ్మె నిర్వహించడం ఒక చారిత్రాత్మక పోరాటమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత మొండిగా వ్యవహరించిన తమ హక్కులు సాధించుకోవడంలో అంగన్వాడీలు పెద్ద పోరాటం నిర్వహించడం అభినందించ విషయమని పేర్కొన్నారు. కార్మిక వర్గానికి ఒక దీక్షలాగా పోరాటం నిర్వహించిందని కొనియాడారు. పోరాడితేనే సమస్యలు సాధించుకుంటాం ఉద్యమిస్తేనే తెచ్చుకోగలమని వాతావరణ ఉద్యమం సృష్టించిందని తెలిపారు. ఇలాంటి స్ఫూర్తితో 42 రోజులు సమ్మె పోరాటం బుక్ లేటు విడుదల చేశారు. అంగన్వాడీ ఉద్యమం అనేక రంగాల కార్మికులకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

- బాధ్యతలు స్వీకరణలో ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎర్రచందనం అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, భూ కబ్జాలు, క్రికెట్ బెట్టింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసు కుంటామని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మొదటగా ఎఆర్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. బాధ్యతలు స్వీకరిం చిన అనంతరం మీడియాతో మాట్లా డుతూ కడప జిల్లా ఎస్‌పిగా రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలిందించేలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గంజాయి నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో పోలీస్ యంత్రాంగం విధులు నిర్వర్తించాలని, అందరూ చట్టానికి లోబడి ఉద్యోగం చేయాలని తెలిపారు. గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక చర్యలు చేపడతామని తెలి పారు. నగరంలో సిసి కెమెరాల పనితీరును పరిశీలించి తగిన చర్యలు తీసు కుంటామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) లోసారి సుధా కర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి జి.వెంకటరాముడు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి.కృష్ణారావు, ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, ఎఒ జ్యోతి పాల్గొన్నారు. అనంతరం డిపిఒలోని వివిధ విభాగాలను పరిశీలించి ఒక్కో విభాగం పనితీరు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలన విభాగం, ఆర్మరీ వర్క్ షాప్, కమ్యూనికేషన్స్ విభాగం, కోర్ట్ మానిటరింగ్ సెల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట బ్యూరో కార్యాలయంను సందర్శించి పరిశీలించి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు


దోబీఘాట్ ధ్వంసం చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

దోబీఘాట్‌ను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కడప

దోబీఘాట్‌ను ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి డిమాండ్ చేశారు. వంశం చేసిన దోబీఘాట్‌ను బుధవారం జిల్లా రజక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా సిద్ధవటం మండలం మాధవరం-1 ఎస్‌కెఆర్ నగర్‌లో రజకుల కోసం 20 సంవత్సరాల కితం దోబీ ఘాట్ నిర్మించారన్నారు. కొంతకాలంగా దోబీఘాట్ మోటారు రిపేరులో ఉన్నందువల్ల స్థానిక రజకులు స్థానిక సంస్థలకు తెలియజేశారన్నారు. ఇంకా రిపేరు చేయాల్సి ఉండగా ఇంతలోనే కొందరు దుండగులు రాత్రి సమయంలో ప్రొక్లైన్‌తో వచ్చి నిర్మించిన తొట్లు, బోరును ధ్వంసం చేశారన్నారు. అక్కడున్న స్థానికులు అడ్డుకోవడం వల్ల ప్రొక్లైన్తోపాటు దుండగులు పారిపోయారన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని, ఆ స్థలంలో దోబీఘాట్ నిధులు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌ను, బిసి కార్పొరేషన్ ఇడిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలయ్య, జిల్లా ఉద్యోగుల సంఘం కార్యదర్శి పెంచలయ్య, స్థానిక రజకులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో సత్తాచాటిన త్రిభువన్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప



రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కడపకు చెందిన క్రీడాకారుడు బిక్క త్రిభువన్‌రెడ్డి సత్తా చాటాడు. కర్నూలు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కడప జిల్లాకు చెందిన ఈతగాడు త్రిభువన్‌రెడ్డి మంచి ప్రతిభ కనబరచి సత్తా చాటాడు. కర్నూలు డిఎస్ఎ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 13, 14వ తేదీలలో నిర్వహించిన 40వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీల్లో కడపకు చెందిన బిక్క త్రిభువన్ రెడ్డి గ్రూప్-3 విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, ఫ్రీ స్టైల్ విభాగంలో 50 మీటర్లు, 100 మీటర్లు, బట్టర్ ఫ్లై విభాగంలో పాల్గొని ఐదు బంగారు పతకాలు సాధించడంతోపాటు వ్యక్తిగత ఛాంపియన్షిప్‌ను కూడా సాధించి సత్తా చాటాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆగస్టు నెల 6వ తేదీ నుండి 11వ తేదీ వరకు భువనేశ్వర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో కూడా త్రిభువన్‌రెడ్డి తన ప్రతిభను కనబరుస్తాడని కోచ్‌లు సుధీష్ కుమార్, రాజేంద్ర, యోగేశ్వరరెడ్డి, ధనుంజయరెడ్డి, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ జనార్ధన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తిక్క త్రిభువన్‌రెడ్డికి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

భోజనశాల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని ఇరామాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం జడ్‌పిహెచ్ఎస్ కర్ణాటక రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ రిటైర్డ్ సహాయ సంచాలకులు డాక్టర్ గొంగళ్‌రెడ్డి కాశిరెడ్డి దాతృత్వంతో నిర్మించతలపెట్టిన భోజనశాలకు బుధవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృత్తిరీత్యా ఇతర రాష్ట్రాలలో స్థిరపడినప్పటికీ తాను పుట్టిపెరిగిన ప్రాంతంలో పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలు విద్యాభి వృద్ధికి తనవంతు సహకారం అందించాలనే సదుద్దేశ్యంతో రూ.10 లక్షల అంచనాతో భోజనశాల నిర్మాణం చేపట్టినట్లు దాత కాశిరెడ్డి తెలి పారు. రెండు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి ఉపాధ్యాయ దినోత్సవం రోజున భోజనశాలను ప్రారంభోత్సవం నిర్వహించదలచామన్నారు. ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లా డుతూ కన్న తల్లిదండ్రులను కూడా కొంతమంది పట్టించు కోకుండా నడిరోడ్డుమీద పడవేసే ప్రస్తుత పరిస్థితులలో తను పుట్టిన ఊరి అభివృద్ధికి ఇంత గొప్ప తోడ్పాటు అందిస్తున్న దాత కాశిరెడ్డి ఔదార్యం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.కమాల్, సర్పంచ్ వెంకటయ్య, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రసూల్, పల్లె ఉమామహేశ్వరరెడ్డి, టీచర్ రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరెడ్డి, రేనాటి బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల మనోభావాలు దెబ్బతీయొద్దు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కలసపాడు

బద్వేల్ నియోజకవర్గంలోని ప్రజల మనోభావాలు దెబ్బ తినకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ డిసి.గోవింద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్వగృహంలో వరికుంట్ల జ్యోతి క్షేత్ర స్థల, అభివృద్ధి వివా దంపై, అటవీ శాఖ వారికి, కాశిరెడ్డి నాయన భక్తులకు మధ్య జరుగుతున్న విషయాలను గురించి ప్రస్తా విస్తూ, గడిచిన ఐదు సంవత్సరాలలో సుమారు 113 దేవాలయాల నిర్మాణాలకు అభివృద్ధికి రూ.29 కోట్లు ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి పనులు చేపించామని పేర్కొన్నారు. కాశీనాయన జ్యోతి క్షేత్రానికి కూడా పనులు సజావుగా జరిగేందుకు అందరి అధికారులతో మాట్లాడి ఫైల్‌ను సిఎంఒ దృష్టిలోనే ఉంచామని ఇంతలో ఎన్నికల కారణంగా అది అక్కడే నిలిచిపోయిందని తెలిపారు. ప్రభుత్వ పాలన యంత్రాంగం జ్యోతి క్షేత్రంలో ఉన్న కాశినాయన సమాధి అభివృద్ధికి కుంటు పడకుండా చూడాలని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బ తినకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపైన ఉందని సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కరెంట్ రమణారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

ఎస్‌పిని సన్మానించిన సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా నూతన ఎస్‌పిగా హర్షవర్ధన్ రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కడప నగరం జనాభా వేగంగా పెరిగి పోవడం వలన ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. యువత మితిమీరిన వేగంతో టూ వీలర్స్ నడపడంతో ఇతర వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఆటోలకు ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లు ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్పింకుండా చూడాలన్నారు. ఎక్కువగా బాలబాలికలు వాహనాలతో రోడ్లపైకి రావడం, వాహనం నడుపుతూ త్రిబుల్ డ్రైవింగ్, ఫోన్‌లో మాట్లాడుతు వాహనం నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి పోలీస్ గస్తీ లేదని తెలిపారు. సర్కిళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు నియంత్రణ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్దార్, హాఫీజ్, షాబుద్దిన్, జావిద్ పాల్గొన్నారు.


ఎస్‌పిని సన్మానిస్తున్న సలావుద్దీన్

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సీనియర్ నాయకులు మహబూబ్ బాషా, డాక్టర్ జమాల్ బాషా పిలుపునిచ్చారు. బుధవారం జిఎం మ్యారేజ్ హాల్‌లో యునైటెడ్ మైనారిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కడప శాఖ ఎగ్జిక్యూటివ్ సభ్యుల సమావేశం అధ్యక్షులు బాషాఖాద్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులు కలిసి కట్టుగా ఉండి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. సమావేశంలో ఉమ జిల్లా కార్యదర్శి మహబూబ్ ఖాన్, సీనియర్ కామ్రేడ్ సుకుమార్, ఎబ్నేజర్, అమజాద్ అలి, యాసిన్ పాల్గొన్నారు.

నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి కడప అర్బన్

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు తుంగ రమణయ్య తెలిపారు. బుధవారం విశ్వప్రగతి చిట్స్ కార్యాలయంలో సభ్యత్వ నమోదు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనసేన కార్యక్రమాల నిర్వహణ కమిటీ రాయలసీమ కన్వీనర్ రంజిత్ కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ మొదటిరోజు శంకరాపురంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్నామని చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నమోదు చేసుకున్న వారికి రూ.ఐదు లక్షలు బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. మూడు సీజన్లో ఆరు లక్షల సభ్యత్వం నమోదైందని, ఈసారి తొమ్మిది లక్షలు కావాలనేదే లక్ష్యమని తెలిపారు. 344 మందికి సాయం చేశామని చెప్పారు. పది రోజులపాటు కొనసాగి సభ్యత్వ నమోదని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయ కులు గజ్జల సాయి, తిరుమల శెట్టి సిద్ధార్థ, తుంగ కిరణ్, అంజి, శీను, మధు, ప్రసాద్ సాయి మహేష్ రమణ శివ పాల్గొ న్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

కృష్ణా, విశాఖపట్నం, రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ విజయం


తలపడుతున్న కడప, కృష్ణా జట్లు

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-19 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో రెండవ రోజు బుధ వారం జరిగిన మ్యాచ్‌లో కడప జట్టుపై 57 పరుగుల తేడాతో కృష్ణా జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు నిర్ణిత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ఆ జట్టులోని వరుణ్ సాత్విక్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించాడు. 124 బంతులను ఎదుర్కొని 8 బౌండరీలు ఒక సిక్సర్ సహాయంతో 106 పరుగులు చేశాడు. సాయి అఖిల్ 59 పరుగులు చేశాడు. కడప జట్టులోని బి.ప్రణవ్‌రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 248 పరుగుల విజయ లక్ష్యంతో బ్యా టింగ్‌కు దిగిన కడప జట్టు 46.5 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 52 పరుగులు చేశాడు. కృష్ణా జట్టులోని రాజేష్ 4, సాయి ప్రకాష్ 3 వికెట్లు తీసుకున్నారు.

ఏడు వికెట్ల తేడాతో విశాఖపట్నం విజయం

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టుపై 7 వికెట్ల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. ఆ జట్టులోని జి.మన్విత్‌రెడ్డి 70 పరుగులు చేశాడు. విశాఖపట్నం జట్టులోని బి.యశ్వంత్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 113 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన విశాఖపట్నం జట్టు 37.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 213 పరుగులు సాధించి 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 69, జి.హెచ్.వర్మ 53, ఎం.యువన్ 57 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని వీరారెడ్డి 2 వికెట్లు తీసుకున్నాడు.

71 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ విజయం

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో నార్త్ జోన్ జట్టుపై 71 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. ఆ జట్టులోని రేవంత్ నాగ కుమార్ 83, కె.సాత్విక్ 84 మనోహర్ 61 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని జున్నారావు 3, రెడ్డి దామోదర్ 2, అనిల్ కుమార్ 2, వికెట్లు తీసుకున్నారు. అనంతరం 364 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జూన్ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసి ఓటమి చెందింది. ఆ జట్టులోని ఎన్.సుశాంత్ బ్యాటింగ్ లో మంచి ప్రతిభ కనబరిచాడు. 100 పంతులను ఎదుర్కొని 11 బావుండారీలు, 2 సిక్సర్ల సహాయంతో 105 పరుగులు చేశాడు. మురళి 79 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని రేవంత్ నాగ కుమార్ 2 వికెట్లు తీసుకున్నాడు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు రూ.25 వేలు ఆర్థికసాయం చేశారు. పట్టణంలోని పశంగి రామన్నరావు శతాబ్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ 2002-03 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థి షేక్ మహబూబ్ బాషా తల్లి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్నామన్నారు. ఆ మేరకు అందరం మాట్లాడుకుని మన పిఆర్ హైస్కూల్ స్నేహిత్ ఫౌండేషన్ ఏర్పాటు చేసుకుని దాని ద్వారా రూ.25 వేలు ఆర్థికసాయం షేక్ మహబూబ్‌బాషాకు చేశామన్నారు. అనంతరం మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బంధువులు, కుటుంబీకులు కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ఏమాత్రం సాయం చేడంలేదని, ఈ పరిస్థితుల్లో తనతో కలిసి చదువుకున్న తన ప్రాణమిత్రులు కష్టకాలంలో సాయం చేశారని, వారికి కృతజ్ఞతలని తెలిపారు. భవిష్యత్‌లో కూడా తమతోపాటు చదువుకున్న ప్రాణ మిత్రుల్లో ఎవరికైనా తీవ్ర ఇబ్బందులు ఉన్నట్లు తెలిస్తే తమవంతు సహాయ, సహకారాలు ఎప్పటికీ ఉంటాయని స్నేహితులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పఠాన్ ఖాజా, షరీఫ్ ఖాన్, కోవెలకుంట్ల ఖాజా మొహిద్దిన్, మార్తల జయవర్ధన్‌రెడ్డి, బేపారి మహమ్మద్ మజహర్ అలీ, పిట్టా రాముడు, సులాకే చక్రపాణి, రామకృష్ణ, రంజిత్‌కుమార్, డక్కన్ నూర్ మహమ్మద్, శ్రీనివాసులు, షేక్ హుస్సేన్ పీరా, కుండా మురళి, గఫార్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె



మాట్లాడుతున్న ఆప్ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా

వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగాయని, ప్రజలు అల్లాడుతున్నారని, దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా కోరారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అరకొర కురుస్తున్న వర్షాలతో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువైందన్నారు. మరో వైపు అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ కాలువల్లో మురుగు నీరు ప్రవహించక దుర్వాసన ఎక్కువైందని తెలిపారు. రాత్రి వేళల్లో ఫ్యాన్లు వేసుకున్నా దోమలతో జాగారం తప్పడంలేదని వాపోయారు. పరిసరాలను పంచాయితీ సిబ్బంది శుభ్రంగా ఉంచాలని కోరారు. చెత్త దిబ్బలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. మురుగు కాలువల్లో ఉన్న తాగునీటి పైపులైన్లపై ప్రత్యేకదృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. విలేకరుల సమావేశంలో ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో -కన్వీనర్ దాదాపీర్, మండల సభ్యులు పీరు బాషా, ఖాదీం పాల్గొన్నారు.

శ్వేత పత్రాలతో వైసిపి నాయకుల్లో వణుకు

- టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు



ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత శాఖల వారీగా శ్వేత పత్రాల విడుదల చేస్తుండడంతో అవినీతికి పాల్పడిన వైసిపి నాయకుల్లో వణుకు మెదలైందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చేసిన అరాచకాలు, అసమర్థత పాలన, తీసుకున్న విధానాలపె ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రాలు విడుదల చేస్తుంటే వైసిపి ముఖ్య నాయకులకు నిద్ర పట్టడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడైనా వైసిపి వాళ్లు శ్వేతా పత్రాలు విడుదల చేసి ప్రభుత్వంలో ఉండే పరిస్థితుల గురించి ప్రజలకు తెలియజేశారా అని ప్రశ్నించారు. చేతకాని పరిపాలనతో 5ఏళ్లపాటు రాష్ట్రాన్ని అన్ని విధాలా వెనుకకు నెట్టారన్నారు. మాజీ సిఎం జగన్ ఢిల్లీ వెళ్లినప్పుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన సందర్భాలు ఉన్నాయా అన్నారు. కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయించే పోలవరం ప్రాజెక్ట్ ఎందుకు పూర్తి చేయలేకపోయారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే 35 రోజులలోనే మచిలీపట్నానికి రూ.75 వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్ట్ తీసుకొచ్చారన్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు పరిపాలన చూసి భారీ పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. ఇకనైనా వైసిపి నాయకులు సొంత పత్రికలో తప్పుడు వార్తలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రభుత్వానికి సలహాలు ఇచ్చి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.



రక్తదానం చేస్తున్న పీరయ్య

నెల చిన్నారికి రక్తదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక నెల వయసు బాబుకు బుధవారం రక్తం అవసరం ఉండడంతో మే ఐహెల్ప్ యు ఫౌండేషన్ సభ్యుడు పీరయ్య రక్తదానం చేశారు. బాధితులు ఫౌండేషన్ వ్యవస్థాపకులు లక్మణ్ మోరేని సంప్రదించగా.. ఆయన వెంటనే స్పందించి పీరయ్యచే రక్తదానం చేయించారు. కార్యక్రమంలో మోషేతోపాటు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, సుమన్, రమణ పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

భార్యను హత్య చేసిన కేసులో నిందితుడు షేక్ అన్వర్ బాషాను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ మేరకు బుధవారం డిఎస్‌పి మురళీధర్ మాట్లాడుతూ మండలంలోని సోములవారిపల్లి పంచాయతీ ప్రొద్దుటూరు-యర్రగుంట్ల రోడ్డులోని పాలకేంద్రం వెనక వైపు ఉన్న రిజర్వు ఫారెస్టులో అమృత్‌నగర్‌కు చెందిన షేక్ అన్వర్ బాషా తన భార్య రేష్మాను హత్య చేసిన కేసులో అరెస్టు చేశామన్నారు. మృతురాలి అన్న ముకుందర్ బాషా ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. తన భార్యను ఈనెల 12న చున్నీతో గొంతుకు గట్టిగా బిగించి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని తెలిపారు. అన్వర్‌బాషాను ప్రొద్దుటూరు రూరల్ సిఐ కె.రమణా రెడ్డి అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి ఒక మోటర్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లు, హత్య చేయడానికి ఉపయోగించిన చున్నీని స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి మురళీధర్

సేంద్రియ ఎరువు.. పొలానికి ఆదరువు

తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులు.. సేంద్రియ విధానంపై రైతుల్లో ఆసక్తి



సేంద్రియ ఎరువును పొలానికి తోలుతున్న రైతు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వ్యవసాయ రంగంలో సేంద్రియ విధానంపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. రసాయనిక ఎరువుల వినియోగానికి బదులు ప్రకృతి, సేంద్రియ విధానాల ద్వారా సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఏటా పెరుగుతున్న పెట్టుబడుల నుంచి ఉపశమనం కలిగించే సేంద్రియ విధానంతో భూమి సారవంతమవుతుంది. మూగ జీవాలు (గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు) పెంచే వారికి ఈ విధానం చక్కటి ఆదాయ మార్గంగా ఉంటోంది. పశువుల విసర్జితాలను నిల్వ చేయడంతోపాటు నేరుగా జీవాలను రెండు, మూడు రోజులు పొలాల్లోనే ఉంచుతారు. తద్వారా వాటి విసర్జితాలు నేరుగా పొలంలో కలిసిపోతాయి. దీంతో ఆ పొలం సారవంతమవుతుంది. ఈ విధంగా రైతులు పొలాను సారవంతం చేస్తారు. గత పంటసాగులో పొలం కోల్పోయిన సారాన్ని ఈ విధానం ద్వారా భర్తీ చేస్తారు. లేకపోతే తర్వాత పెట్టే పంట దిగుబడిలో ఆ ప్రభావం కనిపిస్తుంది. పంట ఉత్పత్తుల దిగుబడి పెంచేందుకు రైతులు రసాయనిక ఎరువు వినియోగాన్ని పెంచుకుంటూ పోతుండడంతో పరిస్థితి మరింత దిగజారిపోయింది. అంతేకాకుండా రైతులపై ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో జీవాల విసర్జితాలతో ఈ లోపాన్ని సంప్రదాయ విధానం ద్వారా భర్తీ చేయవచ్చు. జీవాల విసర్జితాలు పంటలకు ఉపయోగపడే కార్బన్ శాతాన్ని పెంచుతాయి. సూక్ష్మపోషకాలైన ఫెర్రస్, మాంగనీసు, కాపర్, మెగ్నీషియంతోపాటు ప్రధాన పొలంలో కుప్పలుగా నిల్వ ఉంచిన జీవ విసర్జితాల ఎరువు పోషకాలైన ఫాస్ఫర్, పొటాష్, నైట్రోజన్ తదితర పోషకాలు కూడా ఉండడంతో భూసారం పెరుగుతుంది. తద్వారా పొలంలో తేమను పట్టుకొనే శక్తి పెరుగుతుంది.

సేంద్రియ ఎరువులపై అవగాహన పెంచుతున్నాం

సేంద్రియ ఎరువులను పొలంలో ఉపయోగించాలని, మంచి దిగుబడులు వస్తాయని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంట నాణ్యమైన దిగుబడి వస్తుంది.

- రాఘవేంద్ర రెడ్డి, ఉద్యాన అధికారి, పులివెందుల

పెట్టుబడి తగ్గుతుంది

సేంద్రియ ఎరువుల వినియోగంతో పెట్టుబడి తగ్గుతుంది. సొంతంగా వర్మి కంపోస్టు ఏర్పాటు చేసుకోవడంతో పాటు జీవ విసర్జితాలతో ద్రావణాలు తయారు చేసి, పురుగుల మందులకు బదులు సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా నాణ్యమైన దిగుబడి వస్తుంది. ఖర్చులు కూడా తగ్గుతాయి.

- మదన్‌మోహన్‌రెడ్డి, రైతు, లింగాల మండలం

తెగుళ్లు నివారించవచ్చు

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల తెగుళ్లు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. పేడను పొలాల్లో వేస్తే పంటలకు తెగుళ్లు రావడం చాలా అరుదు. అందుకే గతంలో కంటే ఇటీవల కాలంలో ఈ విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతులకు ఆదాయం పెరుగుతుంది.

- రామాంజనేయులు, రైతు, వేముల.



పొలంలో సేంద్రియ ఎరువు చల్లుతున్న రైతు

మతసామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ



పీర్ల చావడి వద్ద ప్రార్థనలు చేస్తున్న సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

మతసామరస్యానికి ప్రతీక పీర్ల పండగ అని ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. నగరంలోని హోమియోపతి కాలేజ్ దగ్గర ఎఎస్ఆర్ నగర్‌లో వెలసి ఉన్న పీర్ల చావిడి మకాన్‌లో పవిత్రమైన మొహరం పండుగను పీర్ల చావిడి నిర్వాహకులు ఎస్.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ 21ఏళ్ల నుంచి పీర్ల పండుగను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. భక్తులకు షరబత్, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీర్ల చావిడి కమిటీ సభ్యులు, హిందూ, ముస్లింలు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మొహరం సందర్భంగా పీర్లను ఊరేగింపు చేశారు. గురజాల, సింహాద్రిపురం తదితర గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. గుండం వద్ద సదింపులు నిర్వహించారు. అనంతరం బ్యాండ్‌మేళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. **పెద్దముడియం :** పీర్ల పండుగను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. జంగాలపల్లి గ్రామంలో పీర్ల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా సాగింది. గ్రామోత్సవాన్ని చూసేందుకు పక్క గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. **చక్రాయపేట :** జిల్లాలో ప్రసిద్ది చెందిన సురభిరెడ్డి వారిపల్లె బాదుల్లా పీర్ల చావిడిలో కులమతాలకు అతీతంగా తొమ్మిది రోజులు మోహరం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బాల తిమ్మయ్యగారి పల్లె సమీపంలో వడ్డెవంకలో నాలుగు గ్రామాల నుంచి వచ్చిన పీర్లతో జల్దీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. **ముద్దనూరు :** మొహరం సందర్భంగా ముస్లింలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో, మంగపట్నం, ఉప్పలూరు, ఉమ్మారెడ్డిపల్లెలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముద్దనూరు రైల్వేగేటు వద్ద కొలువుదీరిన పీర్లను కమిటీ సభ్యులు అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో పీర్ల చావిడి నుండి ఊరేగించి ఏటికి తరలించారు. కుల మతాలకు అతీతంగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **దువ్వూరు :** మండల కేంద్రమైన దువ్వూరులో ముస్లింలు మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం నుండి బాదుల్లా బీరు బంగారు, బీరు చిన్న పీర్లను బాణాసంచా బ్యాండ్ మేళాలతో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా హిందువులు కూడా పాల్గొన్నారు.



చక్రాయపేట : జల్దీ అందుకుంటున్న నాలుగు గ్రామాల పీర్లు



పెద్దముడియం : ఊరేగింపుగా ఏటికి వెళుతున్న పీర్లు



దువ్వూరు : గ్రామోత్సవంలో పీర్లు

కదలని మురుగు.. పారిశుద్ధ్యం కనుమరుగు

ప్రజాశక్తి - ఖాజీపేట

వర్షాకాలం మొదలైంది. చిన్నపాటి వర్షాలకు ఆయా గ్రామాల్లో వీధులన్నీ జలమయమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల భయంతో ప్రజలు వణికిపోతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో డయేరియా కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. రహదారులు సక్రమంగా లేకపోవడంతో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరంతా రోజుల తరబడి నిల్వ ఉంటోంది. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు హడలిపోతున్నారు. అపరిశుభ్రతతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఆస్కారం లేదు. దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ రహమత్ ఖాన్‌పల్లెలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. వర్షం నీరు రోజుల తరబడి నిలుస్తోంది. దోమల బెడద, దుర్వాసతో అల్లాడిపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం సందర్భంగా అంటు రోగాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రహమత్ ఖాన్‌పల్లెలో నెలకొన్న అపరిశుభ్రత

నిత్యావసర సరుకులు వితరణ



సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శరణ్య కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక పార్నపల్లి రోడ్డులోని డిఎస్‌రెడ్డి కాంపౌండ్‌లో ఉన్న శరణ్య ఆసుపత్రిలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శరణ్య, నవీన్‌కుమార్ కుమార్తె సాయినవీషా పుట్టినరోజు సందర్భంగా బుధవారం కేక్ కట్ చేసి, విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేశారు. అనంతరం శరణ్య కుటుంబసభ్యులు 30 విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ శరణ్య కుటుంబ సభ్యులు సేవా రంగంలో కూడా ముందుకు రావడం హర్షణీయమన్నారు. డాక్టర్ శరణ్య మాట్లాడుతూ అంగవైకల్యం శాపం కాదని, వైద్య సంబంధమైన, జన్యుసంబంధమైన కారణాల వల్ల వివిధ రకాల వైకల్యాలు వస్తాయన్నారు. ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. మేనరిక వివా హాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు డాక్టర్ పి.కొండయ్య, రమాదేవి, కావలి ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ రామకృష్ణారెడ్డి, లక్ష్మీకాంతమ్మ, శరణ్య ఆసుపత్రి మేనేజర్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసరి విజయ్

ఎయిర్‌టెల్, జియో సర్వీసులను బహిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎయిర్‌టెల్, జియో టెలికాం సర్వీసులను బహిష్కరించాలని జమ్మలమడుగు సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోంలో బుధవారం విజయ్ మాట్లాడుతూ సదరు టెలికాం కంపెనీలు పేద, మధ్యతరగతి ప్రజలను రీఛార్జ్‌ల సాకుతో నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. ఆయా కంపెనీల యాజమాన్యాలు వారి విలాసవంతమైన జీవితాల కోసం పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలపై ఏమాత్రం గౌరవం ఉన్నా ముఖ్యమంత్రి సదరు కంపెనీలు తీసుకొచ్చిన కొత్త రీఛార్జ్ పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశం కోసం.. ధర్మం కోసం అంటూ ఉపన్యాసాలు ఇస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే స్పందించి ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాలను అరికట్టాలన్నారు. భారతదేశ ప్రజల గొంతుక, ఆస్థి అయిన బిఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థను అభివృద్ధి చేసి 4జి, 5జి, సేవలను వెంటనే దేశ, రాష్ట్ర ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించకపోతే వెంటనే ప్రజలంతా బిఎస్ఎన్ఎల్‌కు మారాలని వారు సూచించారు. కార్యక్రమంలో అబ్రహం, రవి, బాషా పాల్గొన్నారు.

'సేవలకు తగ్గ ఫలితం దక్కింది'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు చెబుతున్న నల్లంశెట్టి నాగార్జున

జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్ సేవలకు తగ్గ ఫలితం లభించిందని జమ్మలమడుగు జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. జనసేన పార్టీ మొదటి శాసనమండలి సభ్యులు హరి ప్రసాద్‌ను నల్లంశెట్టి నాగార్జున బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ జనసేన పార్టీ తరుపున మొదటి ఎమ్మెల్సీగా హరి ప్రసాద్ చరిత్రలో నిలబడిపోతారన్నారు. ఎమ్మెల్సీ కంటే ముందు పార్టీ మీడియా అధినేతగా, పవన్ కళ్యాణ్‌కు రాజకీయ కార్యదర్శిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సేవలను పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గుర్తించి పార్టీ తరుపున ఎమ్మెల్సీగా ఎంపిక చేశారన్నారు. పవన్ కళ్యాణ్‌కు, పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హరి ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో పార్టీ నుంచి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని నాగార్జున ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



పూజలందుకుంటున్న శ్రీబాల త్రిపుర సుందరి దేవి అమ్మవారు

మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో బుధవారం ఆషాఢ మాస శుద్ధ తొలి ఏకాదశి పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ శివనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉపవాసం ఉండి రాత్రి జాగారం చేసి మరుసటి రోజున విష్ణుమూర్తికి పూజలు చేస్తారు. ప్రొద్దుటూరుకు చెందిన అలివేలమ్మ శిష్య బృందం ఆలయ ఆవరణలో ఘనంగా చండీహోమం నిర్వహించారు.

శుద్ధినీటిని ప్రజలకు అందించాలి

- జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

పెద్దముడియం : పెద్ద పసుపులలో హరినాథ్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను బుధవారం టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి ప్రారంభించారు. ప్రజలకు శుద్ధమైన మంచినీటిని అందించాలని ప్లాంట్ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బాపత్రిమణారెడ్డి, హరినాథరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మందకృష్ణను కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

పెద్దముడియం : ప్రొద్దుటూరు పట్టణంలో ఎంఎస్‌పి కార్యాలయాన్ని ప్రారంభించేందుకు బుధవారం ప్రొద్దుటూరు విచ్చేసిన మందకృష్ణ మాదిగను మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలి శారు. ఉద్యమ విధి విధానాలు, దళితుల చైతన్య కార్యక్రమాల గురించి ఆయనతో చర్చించామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నయ్య మాదిగ తెలిపారు. జమ్మల మడుగు పట్టణ ఇన్‌ఛార్జి చిన్న వెంకటసుబ్బయ్య, కార్యదర్శి దస్తగిరి, రామ పుల్లయ్య పాల్గొన్నారు.